ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు ఇఫ్తార్ (ఆది) సా.6.18 సహరి (సోమ) ఉ.4.59

నకిలీ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్ 7

డిపాజిట్‌దారులు వదంతులు నమ్మవద్దు 7

» జయలక్ష్మి సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

రేపటి నుంచి మన్నెం కొండ జాతర ప్రారంభం



అమ్మవారిని పల్లకీలో తీసుకొస్తున్న దృశ్యం(ఫైల్‌ఫొటో)



సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఒడిశాలోని మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయి

- » ఒడిశా వనదేవతకు... ఆంధ్రా మన్యంలో ఉత్సవాలు
- » ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఒడిశా, ఆంధ్రా అధికారులు
- » వేలల్లో తరలిరానున్న ఇరు రాష్ట్రాల భక్తులు

6



ఐటీ చెన్నైతో తలపడుతున్న ఐటీ చెన్నై జట్టు

ఏఎస్ఆర్ టోర్నీ విజేత ఐటీ చెన్నై

- ● గొల్లవిల్లిలో ముగిసిన వాలీబాల్ పోటీలు
- ● మహిళా విజేత ఆంధ్రా జట్టు

7

చికెన్ తిందాం..రా!



సండే 'స్పెషల్'

చికెన్ లేదా.. నాకు అన్నం వద్దంటూ మారాం చేయని పిల్లలు అరుదు. నాకు లెగ్ పీస్ కావాలమ్మా అంటూ ముందే రిజర్వు చేసుకునే టీనేజర్లు.. చికెన్ ఫ్రై చేయనా, కర్రీనా అంటూ కిచెన్‌లోంచే ఆఫర్ ఇచ్చే ఇల్లాలు.. ఈలోగా హోటల్‌కెళ్లి దమ్ బిర్యానీ తిందామా అంటూ ఇంటాయన బంపర్ ఆఫర్. ఆదివారం వచ్చిందంటే.. మాంసాహారం తినే వారి ప్రతి ఇంట్లో ఓ చికెన్ మేళానే. పండగన్నా, ఫంక్షనన్నా చికెన్ వెరైటీస్‌తో మరో మెగా మేళా. బలం కోసం గుడ్లు తినండి.. ఓ సలహా. పౌష్టికాహారంలో గుడ్డుదే తొలి మెనూ. ఒక్కే ఒక్క భయం అన్నిటినీ దూరం చేసేసింది. బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోడిమాంసం, గుడ్ల వ్యాపారాన్ని కుప్పకూలేలా చేసింది. వైరస్‌తో కోళ్లు చనిపోయిన మాట వాస్తవం. కానీ దాని ప్రభావం మనుషులపై చూపలేదు. కేవలం భయాందోళనే చికెన్‌ను దెబ్బతీసింది. నెలరోజుల్లో కోట్లలో వ్యాపారం దెబ్బతింది. ఇప్పుడిప్పుడే మళ్లీ జనం చికెన్ వైపు మళ్లేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పరిశ్రమ కూడా ఉచిత చికెన్ మేళాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక పట్టణాల్లో విస్తృత ప్రచారం చేసింది. మరి ఈ ఆదివారం ఆ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాలి.

- » ఊరూవాడా పౌల్ట్రీ రంగం ప్రచారం
- » బర్డ్‌ఫ్లూతో కోట్లతో నష్టపోయిన పరిశ్రమ
- » ఉచిత మేళాలు గట్టెక్కిస్తాయనే ఆశలు
- » కోలుకుంటేనే అనుబంధ వ్యాపారాలకూ జోరు
- » ప్రస్తుతానికి మటన్, చేపలు, రొయ్యలదే హవా
- » వేడుకల్లో 'మటన్' మెనూతో పెనుభారం
- » చికెన్ ఉంటేనే నాన్‌వెజ్ ప్రియులకు పండగ

(అమలాపురం/అనపర్తి/పిఠాపురం/మండపేట/కొవ్వూరు-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి ప్రచారంతో దాదాపు నెల రోజులపాటు కోడిమాంసం, గుడ్లు వ్యాపారం పడిపోయింది. అధికారులు, వైద్యులు, పరిశ్రమకు చెందినవారు ఎంత అవగాహన కల్పించినా జనం చికెన్ తినేందుకు ఇష్టపడలేదు. కనీసం గుడ్లు తినాలన్నా భయపడే రోజులు కొనసాగాయి. ఇది పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద దెబ్బ. కేవలం భయాందోళన వల్ల జరిగిన భారీ నష్టమిది. పేదవర్గాలు సైతం కోడిమాంసం తినేందుకు ముందుకు రాలేదంటే దాని ప్రభావం ఏమేరకు చూపిందో అర్థం చేసుకోవచ్చు. తూర్పుగోదావరి జిల్లాలోని పెరవలి మండలం బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు పెద్దఎత్తున చనిపోవడంతో ఈ విషయం తొలుత బయటకొచ్చింది. ఆ తర్వాత ఈ జిల్లాలో మరికొన్ని పౌల్ట్రీ ఫారాల్లోనూ బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు చనిపోవడంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొద్దంటూ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో కూడా కొన్నిచోట్ల ఇదే పరిస్థితి తలెత్తడంతో కాకినాడ జిల్లాతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనూ కొంతకాలం చికెన్ తినొద్దంటూ కలెక్టర్లు ఆదేశించారు. ఇందులో కోనసీమ జిల్లాలో ఈ ప్రభావంతో చనిపోయిన కోళ్లు పెద్దగా లేవు. అలాగే ఈ మూడు జిల్లాల్లో పౌల్ట్రీల్లో పనిచేసే కూలీలకు శ్వాబ్ పరీక్షలు చేస్తే ఏ ఒక్కరికీ బర్డ్‌ఫ్లూ లక్షణాలు సోకలేదు. దీంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొచ్చంటూ అధికారులు, వైద్యులు చెబుతూ వచ్చారు. కానీ జనం మాత్రం చికెన్ అంటే భయపడుతూనే వచ్చారు. పౌల్ట్రీ పరిశ్రమ పెద్దలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్ మేళాలు నిర్వహించి ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాలకు జనస్పందన కూడా బావుంది. చికెన్, గుడ్ల కోసం అన్నిచోట్లా పెద్దఎత్తున జనం ఎగబడ్డారు. ఈ అవగాహన ఎంతవరకు ఫలిస్తుందో, దాని ప్రభావం ఏమేరకు ఉంటుందో వేచిచూడాలి.

చికెన్ షాపులు వెలవెల

బర్డ్‌ఫ్లూ ఎఫెక్టుతో చాలా చికెన్ షాపులు మూతపడ్డాయి. గత వారం నుంచే చాలామంది చికెన్ దుకాణాల్లో ఓమోస్తరుగా అమ్మకాలు చేస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో సాధారణంగా 15 రోజుల్లో పది వేల కోళ్లు విక్రయించేవాడు. గత పక్షం రోజుల్లో కేవలం 500 కోళ్లను మాత్రమే విక్రయించాడంటే చికెన్ అమ్మకాలు ఏ స్థాయిలో పడిపోయాయో అర్థంచేసుకోవచ్చు. పిఠాపురంలో మరో చికెన్ షాపు నిర్వాహకుడు మాట్లాడుతూ తాను ఆదివారం నాడు 2వేల కిలోల వరకూ అమ్మేవాడినని, అది వంద కిలోలకు పడిపోయిందని వాపోయాడు. అలాగే కిలో చికెన్ స్కిన్‌లెస్ నెల కిందట రూ.220 వరకు విక్రయించగా, ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 మధ్య అమ్ముతున్నారు. అయినాగానీ అమ్మకాలు అంతంత మాత్రమే.

ఫంక్షన్లలో మటన్ మెనూలు

బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు తగ్గి అంతా మటన్, చేపలు, రొయ్యలు, పీతల వంటి వాటిపై పడ్డారు. ఫలితంగా వాటి ధరలు పెరిగిపోయాయి. మటన్ కిలో రూ.800 ఉండే ధర రూ.వెయ్యికి, కొన్నిచోట్ల రూ.1100 వరకు పెరిగిపోయింది. చేపలు, రొయ్యల ధరలూ అదేవిధంగా పెరిగిపోయాయి. ఇది పెళ్లిళ్ల సీజన్. వివాహ రిసెప్షన్‌లు ఉంటే నాన్‌వెజ్‌తోనే వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఇతర ఫంక్షన్లలోనూ నాన్‌వెజ్ వంటకాలే ఉంటున్నాయి. వీటి అన్నిటిపైనా చికెన్ ప్రభావం పడింది. ఆయా వేడుకల మెనూలో చికెన్‌ను కొందరు నామమాత్రంగా పెడితే, కొందరు పూర్తిగా మటన్, చేపలు, రొయ్యల వంటకాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వెళ్లిన వారు కూడా మటన్‌పైనే మక్కువ చూపడంతో ఆమేరకు తగిన పరిమాణంలో సిద్ధం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా వేడుకల ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇది ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టుంది.



పుట్టగొడుగులకూ డిమాండే

అమలాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగదారులు తగ్గిపోయారు. మార్కెట్‌లో ఉదయం వేలాడదీసిన కోళ్ల అమ్మకాలు రాత్రి అయినా పూర్తికాని పరిస్థితి. మార్కెట్‌లో ప్రస్తుతం చేపలు, మటన్ అమ్మకాలు పెరిగినమాట వాస్తవమే. గోదావరి, సముద్రపు చేపల ధరలతోపాటు మటన్ రేటు కూడా పెరిగిపోవడంతో అందరూ కొనుగోలు చేయలేని పరిస్థితి. దీంతో మాంసాహార ప్రియులుతక్కువ ధరకు దొరికే మష్రూమ్స్ (పుట్టగొడుగులు) లేదా పన్నీర్ వంటకాలపై దృష్టి సారించారు. మార్కెట్‌లో పన్నీర్ రూ.90 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. మష్రూమ్స్ ప్యాకెట్ రిటైల్‌గా రూ.20కే దొరుకుతుండడంతో మాంసాహార ప్రియులు తమ వంటకంగా పుట్టగొడుగులను ఎంచుకున్నారు. ఈ రెండు వంటకాలు వేటికవే ప్రత్యేకం కావడంతో ఆదివారం తక్కువ . ఖర్చుతోనే విందు చేసుకుంటున్నారు.



పిఠాపురంలో చికెన్ మేళా

హోటళ్లలో బెటర్.. పాస్ట్‌ఫుడ్‌లన్నీ మటాష్

సాధారణంగా హోటల్ ఫుడ్ ఇష్టపడేవారంతా చికెన్‌తో పదుల సంఖ్యలో చేసే వెరైటీల కోసమే వెళతారు. బిర్యానీల్లోనూ ఎన్నో వెరైటీలు. బర్డ్‌ఫ్లూతో చికెన్ వంటకాలపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడిప్పుడే చికెన్ బిర్యానీలు, వంటకాలకు కాస్త గిరాకీ తగులుతోందని, అది కూడా నాణ్యతలో పేరున్న హోటళ్లకే పరిమితమని ఒక హోటల్ నిర్వాహకుడు తెలిపాడు. కేవలం చికెన్, గుడ్లతోనే పాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుస్తాయి. అవన్నీ నెలరోజులుగా బేరం లేక మూలనపడ్డాయి. బహుశా వారం పదిరోజుల్లో సాధారణ స్థితి నెలకొంటుందని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

గుడ్డిలో మెల్ల... గుడ్డు ధర

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోళ్ల పరిశ్రమ అతలాకుతలం అవుతున్న తరుణంలో గుడ్ల ఎగుమతులపై తొలుత ప్రభావంపడినా మెల్లమెల్లగా ఎగుమతులు ఊపందుకున్నాయి. నెలరోజుల కిందట రూ.4 దిగువకు చేరుకున్న గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.80కు చేరుకోవడంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా ప్రాంతాల్లో కోళ్లకు నష్టం లేకపోయినా వినియోగం తగ్గడంతో తీసేయాల్సిన లేయర్ బ్యాచ్‌లు బయటకు వెళ్లక రైతులపై భారం పడుతోంది.

చికెన్ మేళాలు ఉపకరిస్తాయా..

కోడిమాంసం కూర గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో ఉడికించి తింటే ఒకవేళ వైరస్ లక్షణాలు ఉన్నా ఏమీ కాదని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా పూర్తిగా ఉడకబెట్టుకుని లేదా వండుకుని తినొచ్చని చెప్పారు. పౌల్ట్రీ సంఘాలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్, గుడ్లు మేళాలు నిర్వహించగా, జనం వాటి కోసం పెద్దఎత్తున ఎగబడ్డారు. ఇది పూర్తి సానుకూల పరిస్థితి ఉంటుందనే ఆశాభావంతో వారంతా ఉన్నారు.

తొలిరోజు ప్రశాంతం



కాకినాడలో ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

- » జిల్లాలో 56 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
- » 22,774మంది హాజరు
- » 857మంది గైర్హాజరు

కాకినాడ రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు లాంగ్వేజ్ పేపర్-1(తెలుగు, సంస్కృతం, హిందీ) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జిల్లావ్యాప్తంగా 56 కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు జరిగాయన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. కొంతమంది తల్లిదండ్రులు పరీక్ష పూర్తయ్యే వరకూ పరీక్షా కేంద్రాల వద్దనే వేచిఉన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తం 23,631మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 22,774మంది పరీక్షలకు హాజరుకాగా 857మంది విద్యార్థులు పరీక్ష రాయలేదన్నారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే 98660 06228 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



శంఖవరం మోడల్ జూనియర్ కళాశాల వద్ద పరీక్షకు హాజరవుతున్న ఇంటర్ విద్యార్థులు



పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న దృశ్యం

నేడు ఆర్ఎంసీ 62 వ స్నాతకోత్సవం

జీజీహెచ్(కాకినాడ),మార్చి1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల 62వ స్నాతకోత్సవం ఆదివారం జరగనుంది. ఈ కార్యక్రమంలో 248మంది వైద్యవిద్యార్థులకు వైద్య పట్టాలను అందించనున్నారు. ముఖ్య అతిథులుగా డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరు కానున్నారు. ఆర్ఎంసీ ఆడిటోరియం సమీపంలో ఉన్న ఓపెన్ గ్రౌండ్‌లో ఇందుకు తగ్గ ఏర్పాట్లను పూర్తి చేశారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.

పౌరసరఫరాలశాఖ అధికారిగా సత్యనారాయణరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణరాజు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నూతన పౌరసరఫరాలశాఖ అధికారిగా ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు కాకినాడలోని తన కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రతినెలా సకాలంలో రేషన్‌కార్డుదారులకు బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో, సీఎస్‌డీటీలు ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా జనసేన ఆవిర్భావ సభ




పిఠాపురం మండలం చిత్రాడ శివారులో జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణం వద్ద వేదిక నిర్మాణానికి భూమి పూజ అనంతరం జనసేన నేతలతో మంత్రి నాదెండ్ల

- » వేదిక నిర్మాణ పనులకు మంత్రి నాదెండ్ల భూమి పూజ

కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ సన్నాహక సమావేశం 7

పిఠాపురం/పిఠాపురంరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఏర్పాటు చేస్తున్న జనసేన ఆవిర్భావ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లకు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. సభా ప్రాంగణం వద్ద వేదిక నిర్మాణ పనులకు నాదెండ్ల, ప్రజాప్రతినిధులు, నాయకులు భూమిపూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన ఈ విజయం ప్రజల కోసమేనని, అదే అంకితభావంతో నిరంతరాయం పనిచేస్తామని సభ ద్వారా తెలియజేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు పనిచేస్తారన్నారు. రాష్ట్ర ప్రజలకు విజయాన్ని అంకితం చేసేలా సభ ఉంటుందన్నారు. ఆవిర్భావ సభకు ఏర్పాట్లు అన్నీ పకడ్బందీగా ఉండాలన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో సభను ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, శాసనమండలి ప్రభుత్వ విప్ హరిప్రసాద్, కుడా చైర్మన్ తుమ్మలరామస్వామి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టిడ్కో చైర్మన్ అజయకుమార్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు, శాసనసభ ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీని వాస్, అరవ శ్రీధర్, నేతలు కదారి తమ్మయ్యనాయుడు, మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకటా.. రెండ్రోజులా..



- » పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపే వేరు
- » పోలైన ఓట్లలో 51 శాతం ప్రాధాన్యత ఓట్లు లభిస్తే విజేతే
- » కాకుంటే ప్రాధాన్యత క్రమంలో గంటల తరబడి లెక్కించాలి
- » బ్యాలెట్ పత్రాలు సరిపోల్చుకుని లెక్కించాల్సి ఉన్నందున భారీ జాప్యం
- » గత అనుభవాలు చెబుతున్నది ఇదే » రేపే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

సాధారణ ఎన్నికలు అలా..

ఐదేళ్లకొకసారి జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటేసేందుకు చాలాకాలం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వాడుతున్నారు. పోలింగ్‌లో వేగం పెంచడం, ఓటర్లకు ఏ సమస్య లేకుండా పారదర్శ కంగా తాము ఎవరికి ఓటేసిందనే విషయం ఒక స్పష్టత వచ్చేలా ఈ పోలింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. కౌంటింగ్ విషయానికి వచ్చేసరికి వేలల్లో ఉండే ఓట్ల లెక్కింపు గంటల్లో పూర్తవుతుంది. ఆ వెను వెంటనే ఫలితం వెల్లడవుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఇలా..

ఈ ఎన్నిక ఆసాంతం ప్రాధాన్యత క్రమంలో లభించే ఓట్లను బట్టే ఫలితం ఆధారపడి ఉంటుంది. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ఇంతకు ముందున్న పాతకాలం నాటి పద్ధతే పోలింగ్‌లో అమలవుతుంది. ఓట్ల లెక్కింపులోను నానా తంటాలు పడాల్సిందే. గంటలకు బదులుగా రోజుల తరబడి ఓట్ల లెక్కింపు జరుగుతూనే ఉంటుంది.

(ఏలూరు/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ ముగిసింది. ఇక మిగిలిందల్లా ఓట్ల లెక్కింపు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అసలు ప్రాధాన్యత ఓటు అంటే ఏమిటి, మొదటి ప్రాధాన్యత ఓటు, ఇతర ప్రాధాన్యత ఓట్లకు తేడా ఏమిటి, ఈ ఓట్లు ఏవిధంగా లెక్కిస్తారు. అసలు విజేతగా గెలవాలంటే అభ్యర్థికి రావాల్సిన ఓట్లు ఎన్ని. లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుంది.. అనే ప్రశ్నలే అటు ఓటు వేసిన వారికి, ఇటు ఫలితం కోసం ఎదురుచూసే వారికి ఎన్నో సందేహాలు. మామూలుగా సాదాసీదాగానే ఎలక్ట్రానిక్ యంత్రాలతో కౌంటింగ్ పూర్తి చేస్తే గంటల వ్యవధిలోనే ఫలితం వస్తుంది. కాని ప్రాధాన్యత ఓటును పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కించాల్సి ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు ఏ అభ్యర్థికి పోలైన ఓట్లలో 50 శాతానికి మించి వస్తాయో ఆ అభ్యర్థి గెలిచినట్టుగా తేలుస్తారు. ఓటు వేసిన వారి పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన ఓట్లనే పరిగణనలోకి తీసుకుంటారు. అలా ఆ ఓట్లలో సగాని కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు మొత్తం పోలైన ఓట్లు 2 లక్షల 14 వేలు చెల్లుబాటు అయితే విజేతకు లక్షా ఏడువేల ఒక ఓటు వచ్చినా సరిపోతుంది. అలా వస్తేనే మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ అభ్యర్థి గెలుపొందిన ట్టు అవుతుంది. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ మైలురాయి అధిగమించకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభి స్తారు. గెలుపు కోటాకు సరిపోయినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండవ ప్రాధాన్యత ఓటును లెక్కిస్తారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓటు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు ఎవరు వేశారని ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పైవరకు ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళ్తారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోను మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థికి జమ చేస్తూ వస్తారు. అప్పటికీకాకపోతే నాల్గవ ప్రాధాన్యం ఇలా మెజార్టీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థికి చేరేవరకు ఎలిమినేట్ ప్రక్రియ అనేది సాగుతూనే ఉంటుంది. దాంతో మొదటి ప్రాధాన్యంతోపాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు కీలకమే.

ఇప్పటికే ఎడతెగని ఉత్కంఠ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు ఏ రకంగా స్పందించారనే ఉత్కంఠ అందరి అభ్యర్థుల్లోను నెలకొంది. తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యే ఫలితం తేలబోతుందని భావిస్తున్నారు. సోమవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికలకంటే భిన్నంగా ఉండబోతుండడంతో టెన్షన్ నెలకొంది. ఈసారి జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యతలోనే అభ్యర్థి గెలుపోటములు తేలబోతున్నాయని భావిస్తున్నారు. గత అనుభవాలను చూస్తే దాదాపు 14 గంటల తర్వాత గాని లెక్కింపు ప్రక్రియ ఒక కొలిక్కిరాదు. లేదా 36 లేదా 48 గంటలపాటు సాగే అవకాశం లేకపోలేదు.

ఒడిశా వనదేవతకు... ఆంధ్రా మన్యంలో ఉత్సవాలు

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఒడిశా, ఆంధ్రా అధికారులు
- వేలల్లో తరలిరానున్న ఆంధ్రా, ఒడిశా భక్తులు

● రేపటి నుంచి మన్నెం కొండ జాతర ప్రారంభం





జాతర ఉత్సవంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా భక్తులు (ఫైల్)

మోతుగూడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు అనే గ్రామం ఉంది. ఇది ఒడిశా సరిహద్దులో ఉండడంతో ఆ రాష్ట్ర ఉత్సవాలను మన రాష్ట్రం లోనూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. కానీ ఇది నిజం. వివరాల్లోకి వెళితే... పొల్లూరు ప్రాంతంలో దట్టమైన అడవుల్లో ఉన్న జలపాతం వద్ద ఈ ఉత్సవాలను ఘనంగా జరుపుతారు. అదీ కూడా మన ప్రాంతంలో ఒడిశా ప్రభుత్వం నిర్వహించడం విశేషం. మన్నెంకొండ జాతరగా పిలిచే ఈ ఉత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. రెండేళ్లకు ఒకసారి ఒడిశా ప్రజలు జాతరను మన రాష్ట్రంలో నిర్వహిస్తుండడం పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. మల్కనగిరి ప్రాంతానికి చెందిన వనదేవత మన మోతుగూడెం ప్రాంతంలో ఉన్న పొల్లూరు వద్ద ఉన్న జలపాతం వద్దకు తెచ్చి స్నానాలు ఆచరించే ఆచారం ఉండేది. ఈ క్రమంలోనే అక్కడ ప్రజలు ఇలా ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఒక గడియల్లో ఇక్కడ జలపాతం వద్ద తీసుకొని వస్తారు. ఆ వనదేవతను ఇలా తీసుకువచ్చి రాత్రంతా ప్రత్యేకపూజలు చేసి జాగారం చేస్తారు. దీన్నే మన్నెంకొండ జాతరగా పిలుస్తారు. పలు ప్రాంతాలకు చెందిన గిరిజనులను వచ్చి వనదేవతను పల్లకీలో మేళతాళాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఉన్న సీలేరు నదిని దాటి పొల్లూరుకి తెస్తారు. ఈ జాతర హంగామా ఒడిశాలో ఫిబ్రవరి 11న ప్రారంభమై మార్చి 12వ తేదీతో ముగిస్తుంది. అయితే ఇక్కడ కూడా ఈ ప్రాంత వాసులు వారం రోజుల పాటు వనదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

● లక్ష బలి యాత్ర

జాతర వద్ద లక్షపల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్భంగా మేకలు, కోళ్లను దేవతకు నైవేద్యంగా సమర్పిస్తారు. దాదాపు లక్ష మూగ జీవులను బలి ఇవ్వనున్నారు.

బంగారు చేప దర్శనమిస్తుందని నమ్మకం



అమ్మవారిని తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

జాతరకు వచ్చే భక్తులకు ఇక్కడ జలపాతంలో బంగారు చేపదర్శన మిస్తుందని నమ్ముతారు. అంటే శబరిమలలో అయ్యప్ప భక్తులకు మకరజ్యోతి ఎలా కనిపిస్తుందో అలాగే ఇక్కడికి వచ్చేవారికి జలపాతంలో బంగారు చేప కనిపిస్తుంది. అందుకే వేలాదిగా భక్తులు తరలివస్తారు. మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ మాట్లాడుతూ భక్తులకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. మల్కన్‌గిరి తహసీల్దార్ నీలకంఠ బోర్, కలిమెలల తహశీల్దార్ సత్యగురు, లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో సెక్యూరిటీ హెడ్‌గార్డ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జి



పొల్లూరులోని సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిను ఏర్పాటు చేశారు. ఈనెల 3న మన్నెం కొండ జాతర జరుగుతున్న దృష్ట్యా రెండోసారి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 20 వేల మంది భక్తులు ఒడిశా, ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల నుంచి రానున్నారు. దీంతో ఒడిశా ప్రభుత్వం ఏకో టూరిజం కింద ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిని ఏర్పాటు చేసినట్టు ఒడిశా అధికారులు తెలిపారు. అలాగే సోమవారం జరిగే జాతర ఏర్పాట్లను ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయ్ బృందం పరిశీలించింది.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

● 30 రోజుల పాటు కఠిన నిష్టతో ముస్లిం సోదరుల నమాజ్‌లు



మామిడికుదురులో సిద్ధమైన మసీదు

కాకినాడ సిటీ /మామిడికుదురు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఉమ్మడి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో దీక్ష చేపడతారు. ఈ నెల 30వ తేదీ వరకు దీక్షలు జరుగుతాయి. ప్రతిరోజూ తెల్లవారు జామున 4.30 గంటలకు సహరీతో ప్రారంభమై , తిరిగి సాయంత్రం 6.20 గంటలకు ఇఫ్తార్‌తో ముగుస్తుంది. దీక్షల్లో భాగంగా ముస్లిం సోదరులంతా ఐదు పర్యాయాలు నమాజ్, ప్రార్థనలు చేసి రాత్రికి ఖురాన్‌ను పఠిస్తారు. పేద, ధనిక, చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళలు సైతం ఉపవాసాలు చేస్తారు.

ప్రజలను మోసగించే బడ్జెట్

- ఏపీలో నిధులు లేకున్నా భారీగా లెక్కలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

అంబాజీపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలను మోసగించే విధంగా ఏపీలో నిధులు లేనప్పటికీ బడ్జెట్‌లో లెక్కలు మాత్రం భారీగా చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో కామ్రేడ్ నేలపూడి సూరన్న 30వ వర్ధంతి కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూరన్న స్వగృహం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.సత్తిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పేదల అభ్యున్నతికి భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తోందన్నారు. కమ్యూనిస్టు భావజాలం ఉనికి పుచ్చుకున్న కామ్రేడ్ సూరన్న చిన్న, సన్నకారు రైతులను, కౌలు రైతుల ప్రయోజనాల కోసం ప్రారంభించిన ఉద్యమం భూమి కోసం, భక్తి కోసం పోరాడే శక్తి ఎర్రజెండా నాయకత్వం కమ్యూనిస్టు నాయకుడిగా కార్మిక ఉద్యమానికి ఒక ప్రభంజనమై జ్వలించారన్నారు. అంబాజీపేటలో కమ్యూనిస్టు పార్టీకి మంచి ఆదరణ ఉందని, మృతిచెందిన ప్రతి కామ్రేడ్ కుటుంబం నుంచి ఒక్కరైన ఎర్రజెండాను పట్టుకుని కామ్రేడ్ ఆశయాలను కొనసాగించాలని ఆయన సూచించారు. దేశం గర్వించే రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందని, ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి శతవసంతాలు పూర్తవుతుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శత వార్షికోత్సవం కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. అలాగే డిసెంబరు 24, 25వ తేదీల్లో విజయవాడలో జరిగే అంతర్జాతీయ సెమినార్‌కు 40 దేశాల నుంచి కమ్యూనిస్టులు, సోషలిస్టులు, దేశంలోని వామపక్ష మేధావులు హాజరవుతారన్నారు. తొలుత సూరన్న చిత్రపటం వద్ద సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబాజీపేటలో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సూరన్న కుటుంబ సభ్యులు కామ్రేడ్ నేలపూడి నాగభూషణం రచించిన కామ్రేడ్ సూరన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. డేగా ప్రభాకరరావు, తాటిపాక మధు, చెల్లుబోయిన కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, పితాని ఆనందరావు, నేలపూడి స్టాలిన్‌బాబు, సుందరయ్య, గిరి పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పలువురు సూరన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

మైనార్టీ యువతకు జాబ్‌మేళాలు

అమలాపురం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో మైనార్టీ యువతకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు ఆ కార్పొరేషన్ కార్య నిర్వాహక సంచాలకుడు ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. అన్ని జిల్లాల్లో ఈనెల 4, 14, 18, 28 తేదీల్లో జరుగుతాయన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన యువత పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. ఈనెల 4న జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమలాపురం మిరియం డిగ్రీ కళాశాల, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, 14న కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పి.గన్నవరం ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఐ ఈఎస్ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, 18న కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొత్తపేట వీకేవీప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజోలు డిగ్రీ కళాశాల, 28న పెద్దాపురం న్యాక్ ట్రైనింగ్ సెంటర్ (సామర్లకోట), ప్రత్తిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఏలేశ్వరం), మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జాబ్‌మేళాలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9849901141 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు

● ట్రాక్ ఆటోమెటిక్ సెక్షన్ పనులే కారణం

సామర్లకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధి కడియం - ద్వారపూడి - అనపర్తి మధ్య ట్రాక్ ఆటోమెటిక్ సెక్షన్ పనులు జరుగుతున్నందున సామర్లకోట మీదుగా అటు విజయవాడ, ఇటు విశాఖకు వెళ్లాల్సిన పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే ఉన్నతాధికారులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

●17239 నెంబరు గల గుంటూరు - విశాఖ మధ్య నడుస్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఆదివారం తాత్కాలికంగా రద్దు.

●17240 నంబరు గల విశాఖ - గుంటూరు మధ్య నడుస్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 2,3 తేదీలలో తాత్కాలికంగా రద్దు.

●12805 నంబరు గల విశాఖ-లింగంపల్లి మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం తాత్కాలికంగా రద్దు.

● 12806 నంబరు గల లింగంపల్లి-విశాఖ మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 3వ తేదీ (సోమవారం) తాత్కాలికంగా రద్దు చేశారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ రైళ్ల ద్వారా ప్రయాణాలు కొనసాగించాలని రైల్వే అధికారులు కోరారు.

విద్యార్థుల వికాసానికి 'సవిస్కర్' దోహదం

● నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వాస్తవ ప్రపంచ అంతర్ దృష్టితో విద్యార్థులను సవిస్కర్ వంటి వేదికలు సన్నద్ధం చేస్తాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఉత్సవం సవిస్కర్-2025ను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ ఇంట్లో అమ్మ దగ్గర నుంచి మేనేజ్‌మెంట్ నేర్చుకోవాలని అన్నారు. ప్రాక్టికల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, నైపుణ్యాభివృద్ధి, నెట్‌వర్కింగ్ అవకాశాలు, వ్యవస్థాపక మనస్తత్వం, కాన్ఫిడెన్స్ బిల్డింగ్, వ్యాపార పోకడలు, సాంకేతికత బహిర్గతం, రెజ్యూమ్, కెరీర్ అవకాశాలను మెరుగుపరచడంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ రాజమండ్రి హెచ్ఆర్ మేనేజర్ వైవీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ కె.సంధ్యారాణి మాట్లాడుతూ ఆధునిక కాలంలో అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, వాటిని అవగాహన చేసుకుంటూ అభివృద్ధి దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఎన్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఫారెస్ట్ అకాడమీ బృందం

కడియం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని శనివారం తెలంగాణా రాష్ట్ర ఫారెస్టు అకాడమీ బృందం సందర్శించింది. బృందానికి నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అకాడమీ ఏసీడీపీ రామ్మోహనరావు మాట్లాడుతూ దేశవిదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమై ఉందన్నారు. రాజమహేంద్రవరం ఫారెస్టు హెడ్ ఆనందరావు, 25వ బ్యాచ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు. మొక్కల అధ్యయనం కోసం వచ్చామన్నారు. కార్యక్రమంలో మెర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.



సత్యదేవానర్సరీని సందర్శించిన తెలంగాణా ఫారెస్టు అకాడమీ బృందం

గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.50లక్షలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో అన్నదానం వద్ద క్యూలైన్లలో వేచియున్న భక్తులు

ఆత్రేయపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారా లు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కాకినాడకు చెందిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం కాలినడకన కొత్తపేట నుంచి వాడపల్లి పాదయాత్ర నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.50,00575 లభించినట్టు ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆటల పోటీల్లో పాల్గొనే వారికి క్యాజువల్ లీవ్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి1(ఆంధ్ర జ్యోతి): ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలు ఆటల పోటీలలో పాల్గొనేందుకు ఈనెల 5,6 తేదీలలో స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేశామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్‌అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావారు అభ్యర్థనకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేశామన్నారు.

అక్కు పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా ప్రశాంతశ్రీ

సర్పవరంజంక్షన్,మార్చి1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం అక్కు ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా ఎస్.ప్రశాంతశ్రీ శనివారం బా ధ్యతలు స్వీకరించారు. ఈమె ఇంతకుముందు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆమె మాట్లాడుతూ పీజీ క్యాంపస్‌లో కొత్తకోర్సుల ప్రారంభం, క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

» వివిధ పుష్పాలతో ఉత్సవమూర్తుల అలంకరణ



విశేష అలంకారంలో స్వామివారు, అమ్మవారు

సామర్లకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్ల శ్రీపుష్పయాగోత్సవ పూజలు శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాదికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో భాగంగా కళ్యాణ వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వినయ్, వెంకన్న శాస్త్రోక్తంగా పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా బాలా త్రిపుర సుందరి అమ్మవారి మందిరం వద్దకు తోడ్కొని వచ్చారు. వివిధ పుష్పాలతో అలంకరించిన ఊయల మందిరంలో ఉత్సవమూర్తులను అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఈ సంద ర్భంగా పలువురు దాతలు సమకూర్చిన 110 రకాల పిండి వంటకాలను ఊయల మండపం వద్ద అలంకరించారు. ప్రముఖులకు దంపత తాంబూలాలు అందజేశారు. 2000మంది భక్తులు శ్రీపుష్పయాగ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తువాళ్లు, రవికలు, పసుపు, కుంకుమ, గాజులు, కొబ్బరి హల్వా, లడ్డూ, అన్నవర సత్యదేవుడి ప్రసాద ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు శ్రీనువాసుసూర్యభాను, కంచర్ల పద్మావతి జగన్నాదగుప్త, ఆర్వీ. సుబ్బరాజు, గం జి బూరిబాబు, తదితర కార్తీక దీపారాధన కమిటీ, భక్తకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటిపల్లి హుండీ ఆదాయం రూ. 11,17,350



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కె.గంగవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి సందర్భంగా హుండీలకు వచ్చిన ఆదాయాన్ని శనివారం ఆలయ ఆవరణలో లెక్కించారు. వీఐపీ, ప్రత్యేక దర్శనం, భక్తుల విరాళాలు, హుండీల ద్వారా మొత్తం రూ.11,17,350 వచ్చింది. గత సంవత్సరం కంటే రూ.44వేలు అదనంగా వచ్చిందని ఆలయ ఈవో భీమశంకరం తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రాంప్రసాద్, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులుచౌదరి, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తూర్పురాజగోపురం వద్దకు తిరుచ్చివాహనంపై తోడ్కొని వచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

సత్యదేవుడి సన్నిధి లో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 3న లెక్కించి వచ్చిన కానుకలను బ్యాంక్‌లో దేవస్థానం ఖాతాకు చేయనున్నట్లు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు వెల్లడించారు. ప్రత్యేకవిదులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

క్రీడాకారుల ఉపకారవేతన అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడఅర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి); వివిధ క్రీడల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు 2025-26కి ఉపకారవేతన అవార్డులు అందజేయడానికి భారత ఆహారసంస్థ జిల్లాలోని క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. 15 నుంచి 24ఏళ్ల మధ్య ఉన్న గ్రామీణ, పట్టణ క్రీడాకారులు ఫుట్‌బాల్, క్రికెట్, హాకీ విభాగాల్లో పురుషులు, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈనెల ఆరో తేదీలోగా ఆన్‌లైన్లో (డబ్ల్యూ, డబ్ల్యూ,డబ్ల్యూ, ఎఫ్‌సీఐ.జీవోబీ.ఇన్)కి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చింతలూరు నూకాంబికా జాతర ఉత్సవాలకు శ్రీకారం

» 15రోజులపాటు గ్రామాల్లో అమ్మవారి బుట్టగరగ ఊరేగింపు



బుట్టగరగతో ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆలమూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలలో జారత ఉత్సవాలలో గుర్తింపు పొందిన ఉత్సవాలలో చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతరఒకటి. అమ్మవారి జాతర ఉత్సవాలను శనివారం బుట్టగరగతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 28న అమ్మవారి జాతర ఉత్సవం, 29న తీర్థమహోత్సవం, 30న ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నెలరోజుల ముందుగా అమ్మవారి గరగ ఉత్సవాలు ప్రారంభిస్తారు. శనివారం నూకాంబికా అమ్మవారి ఆలయ అర్చకులు ఆసాధులు ప్రత్యేకపూజలుచేసి ప్రత్యేకంగా తయారు చేసిన తాటాకు బుట్ట గరగకు పసుపు బియ్యంతో అమ్మవారి పేరుతో అందంగా అలంకరించి ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయంవద్ద ప్రత్యేకపూజల అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు గన్ని చిన్నబ్బు, పైట్ల శేషుబాబు, గన్ని సూరిబాబు, అల్లం రాజు భరణి తదితరుల సమక్షంలో బుట్ట గరగ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన ఊరేగింపులో మహిళలు పసుపునీళ్లతో స్వాగతం పలికారు. మండలంలో రోజు ఒకఊరు చొప్పున 15రోజులపాటు అమ్మవారిని బుట్టగరగతో ఊరేగింపు నిర్వహించి తదుపరి 15రోజులపాటు కొత్త, పాత పూల ఉత్సవాలు నిర్వహించి అనంతరం ఈనెల 28న ప్రధాన జాతర నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి వీర్రాజుచౌదరి వివరించారు.

పరీక్షా సమయ(ర)ం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పరీక్షా కేంద్రాల వద్ద దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.


పిఠాపురంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


అమలాపురంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు




రాజమహేంద్రవరంలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


కాకినాడలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుని పరీక్షకు వెళుతున్న విద్యార్థులు



చిత్రాడలో 14న జనసేన ఆవిర్భావ సభ

- ప్రతి నాయకుడు, కార్యకర్త ఐకమత్యంగా పని చేసి విజయవంతం చేయాలి
- జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్
- కాకినాడలో సన్నాహక సమావేశం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ కుళాయి చెరువులో ఉన్న గోదావరి కళా క్షేత్రంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో కుడా చైర్మన్ తుమ్మలబాబు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. జనసేన పార్టీ పదేళ్లపాటు ప్రజల్లో ఉంటూ అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఈ రోజు రాష్ట్రంలో ఒక బలమైన పార్టీగా అవతరించిందన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో జనసైనికులు మన పార్టీని కాపాడిన విధానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కష్టపడి పనిచేసి జెండాను మోసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు.

ద్వారంపూడి అహంకారంతో విర్రవీగారు

అధికారం ఉందనే అహంకారంతో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అహంకారంతో విర్రవీగారని మంత్రి నాదెండ్ల విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పవన్‌కల్యాణ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలకు జనసేన కార్యకర్తలు నిరసన చేపట్టగా వారిపై ద్వారంపూడి దాడులు చేయించడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశారన్నారు. ఇప్పటికీ జనసైనికులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, అయినా జనసేన శ్రేణులు ధైర్యం కోల్పోకుండా పోరాటం చేస్తున్నారని ఆయన చెప్పారు.


కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

గత ఐదేళ్లు వైసీపీ విధ్వంసం

గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంస కార్యక్రమాలు చేసిందని మంత్రి నాదెండ్ల ధ్వజమెత్తారు. ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయకుండా వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రోడ్లపై ఉన్న ఒక్క గుంతను కూడా పూడ్చలేదన్నారు. ఇప్పుడు ఆ గుంతలను పూడ్చడానికి రూ.1600కోట్లు కేటాయించినా సరిపోవడం లేదన్నారు. పవన్‌పై అవాకులు చవాకులు పేలుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కూడా చర్యలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం రైతులకు ధాన్యం బకాయిలు రూ.1600 కోట్లు పెట్టి వెళ్లిపోతే మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రైతులకు చెల్లించామని మంత్రి నాదెండ్ల తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలో అన్నదాత బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ములు జమ చేస్తుందన్నారు. కమిటీలు నిరంతరం పర్యవేక్షించి సభను విజయవంతం చేస్తాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తు జనసేనపైన ఉందన్నారు. నిష్కలంకమైన మన నాయకుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆలోచన వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నిర్వహించే తొలి సభ కావడంతో అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, శాసనసభలో ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అవర శ్రీధర్, జనసేన ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

కాకినాడలో కంట్రోల్‌రూమ్

జనసేన ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయడానికి కాకినాడ కుళాయిచెరువు వద్ద ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు మంత్రి నాదెండ్ల తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. కంట్రోల్ రూమ్‌లో సమీక్షలు నిర్వహించుకుని ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు ఘనంగా చేస్తామ న్నారు. కమిటీల్లో పేర్లు లేకపోయినంత మాత్రాన మీరు పని చే యొద్దని కాదని, ప్రతిఒక్కరూ పనిచేస్తేనే సభ విజయవంతం అవుతుందన్నారు. జనసేన సభ్యత్వాలు 60వేల నుంచి 12.42లక్షల వరకు పెరిగాయని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఐకమత్యంగా పనిచేసి సభను విజయవంతం చేయాలన్నారు.



వేడుకలకు కమిటీలు ఏర్పాటు : మంత్రి దుర్గేష్

జనసేన ఆవిర్భావ వేడుకల విజయవంతానికి 500మందితో 14 కమిటీలు రూపొందించామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.


సమావేశానికి హాజరైన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు


సీతానగరం మండలం కాటవరంలో దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్లు

పొగాకు బ్యారన్లు దగ్ధం

సుమారు రూ.50లక్షల ఆస్తి నష్టం

రాజమహేంద్రవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరంలో 4 పొగాకు బ్యారన్లు, 3 గడ్డి పాకలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో చిట్టూరి వరప్రసాద్, పోలిన ప్రకాశం, చిట్టూరి వీర్రాజుకు చెందిన పొగాకు బ్యారన్లలో వర్జీనియా పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ బ్యారన్‌లోని గొట్టాలపై ఆకులు పడి అగ్ని ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇక్కడ ఉన్నవన్నీ సులభంగా మండే స్వభావం కలిగిన పొగాకు, ములకల కర్రలు, సర్వే బాజులు, రెల్లుగడ్డి, కర్రలు కావడంతో మంటలు వేగంగా ఎగిసిపడుతూ విస్తరించాయి. స్థానికులు ఇళ్లలోని మోటార్లు ఆన్ చేసి నీళ్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కోరుకొండ, ఆర్యాపురం, కొవ్వూరు నుంచి సుమారు 10 మంది అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని సుమారు 2 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే పొగాకు బేళ్లతో సహా అన్నీ బూడిదయ్యాయి. ఆస్తినష్టం సుమారు రూ.50లక్షల వరకూ ఉండొచ్చని చెబుతున్నారు. ఆస్తి నష్టంపై అంచనా వేయాల్సి ఉందని, ప్రమాద కారణాలపై కూడా ఆరా తీస్తున్నామని ఫైర్ అధికారులు తెలిపారు. కాగా బ్యారన్ల వద్ద ఎలాంటి అగ్నిమాపక పరికరాలు, ఏర్పాట్లు లేకపోవడంతో వేగంగా మంటలు విస్తరించి నష్టం అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది.

నకిలీ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

46 మద్యం బాటిళ్ల స్వాధీనం

కాకినాడ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం బాటిళ్లలో స్థానిక మద్యాన్ని నింపుతూ విదేశీ మద్యంగా విక్రయాలు సాగిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన కాకినాడ పోలీసులు వారి నుంచి శనివారం 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ కెవిఎస్.సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. స్థానిక సాంబమూర్తి నగర్‌కు చెందిన సయ్యద్ సలీం భాషా, బ్యాంకుపేటకు చెందిన శీలం రామకృష్ణ కలిసి డబ్బులు సులువుగా సంపాదించాలనే దురుద్దేశ్యంతో గత 3 నెలల నుంచి హైదరాబాద్ నుంచి ఖాళీ విదేశీ మద్యం బాటిళ్లను సేకరించి కాకినాడలో దొరికే ఇండియన్ మేడ్ విస్కీ లిక్కర్ బాటిళ్లను కొని ఒక పరికరంతో ఖాళీ సీసాలోకి మద్యాన్ని నింపి విదేశీ బాటిళ్లంటూ ఎక్కువ నగదుకు విక్రయించేవారు. ఈ నేపథ్యంలో తమకు వచ్చిన సమాచారం మేరకు నిఘాను పటిష్టం చేయగా నిందితులను స్థానిక బ్యాంక్‌పేటలో అరెస్ట్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

డిపాజిట్‌దారులు వదంతులు నమ్మవద్దు

జయలక్ష్మి సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

సర్పవరం జంక్షన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం చేసేందుకు చట్టబద్ధంగా పని చేస్తున్నామని, సొసైటీ నిర్వహణపై కొంతమంది లేనిపోని వదంతులు సృష్టించి గందరగోళానికి గురిచేస్తున్నారని వాటిని నమ్మవద్దని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు కోరారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో జయలక్ష్మి సొసైటీ సెంట్రల్ కార్యాలయంలో పాలకవర్గం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ కోట్లాది డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన పూర్వపు సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లపై సీఐడీ అరెస్ట్ చేశారని, వారు నుంచి కోట్లాది విలువ చేసే స్థిరాస్తులను సీఐడీ స్వాధీనం చేసుకుని కోర్టులో చట్టబద్ధంగా ఈ ఆస్తుల స్వాధీనం, విక్రయం కోసం కృషి చేస్తున్నామన్నారు. కోట్లాది రూపాయలతో ఉడాయించడమే కాకుండా ఎటువంటి ఆధారాలు లేని జీరో స్థాయిలో అధికారికంగా పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేడు సుమారు రూ.550 కోట్లకు పైగా విలువచేసే స్థిరాస్తులపై చట్టబద్ధంగా అధికారం చేజిక్కించుకునేస్థాయిదాకా తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో వాదప్రతివాదనలో ఉన్నాయన్నారు. కొంతమంది షేర్‌హోల్డర్స్ డిపాజిట్‌దారులను ఆందోళనకు గురి చేసేలా పాలకవర్గంపై లేని పోని నిరాధార ఆరోపణలు, ప్రకటనలు చేస్తున్నారని, అంతా పారదర్శకంగా నడుస్తోందన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సొసైటీలో 9 మంది డైరెక్టర్లు ఉండగా వారంతా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పీవీ రమణమూర్తి, డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్, ఏవీఎస్ రవికుమార్, కె.గౌరీ శంకర్, అల్లంరాజు గవర్రాజుకుమార్, కాట్రగడ్డ సురేష్, చింతా సుబ్బారావు, అముజూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్రోల్ పోసి నిప్పంటిస్తా


పి.రాయవరంలో పెట్రోల్ బాటిల్‌తో వ్యక్తి హల్‌చల్

పిఠాపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తాను పనిచేసిన కాలానికి తక్షణం జీతాలు చెల్లించకుంటే పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించడమే గాక ఉద్యోగులను సచివాలయంలో ఉంచి బయట పెట్రోల్‌బాటిల్ పట్టుకుని హల్‌చల్ చేశాడు ఒక వ్యక్తి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరం సచివాలయంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి ప్రియాంక మయూరి, ఇతర ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయవరం గ్రామపంచాయతీలో కాటూరి లోవ సత్తిబాబు గతంలో క్లాప్‌మిత్రగా పనిచేశాడు. తాను చేసిన కాలానికి జీతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ప్రియాంకను డిమాండ్ చేశాడు. తాను ఇటీవలే వచ్చానని, ఇంకా చార్జి తీసుకోలేదని తెలపగా దీంతో ఆగ్రహించిన సత్తిబాబు అక్కడే ఉన్న కాంట్రాక్టు ఉద్యోగి రాజబాబుపై పెట్రోల్ పోసి నిప్పు అంటిస్తానని బెదిరించాడు. పెట్రోల్‌బాటిల్‌తో వచ్చిన అతడిని చూసి ఉద్యోగులందరూ భయభ్రాంతులకు గురయ్యారు. కార్యాలయం తలుపులు వేసి పెట్రోల్ బాటిల్‌తో అక్కడే కూర్చోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చినా అతడు వెనక్కి తగ్గలేదు. ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.


పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేస్తున్న సత్తిబాబు

ఏఎస్‌ఆర్ టోర్నీ విజేత ఐటీ చెన్నై

- గొల్లవిల్లిలో ముగిసిన వాలీబాల్ పోటీలు
- మహిళా విజేత ఆంధ్రా జట్టు



ఆంధ్రా, తెలంగాణ మహిళల జట్ల మధ్య పోరు


విజేతకు కప్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

ఉప్పలగుప్తం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లిలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీల్లో ఐటీ చెన్నై విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాలను జీఎస్టీ(ముంబై), ఐబీ(చెన్నై) గెలుచుకున్నాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ బహుమతి ప్రదానం చేశారు. నాల్గవ రోజు శనివారం పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలు తిలకించేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. అతిథులను టోర్నమెంట్ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సతీమణి నాగరత్నకుమారి, ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ ఘనంగా సత్కరించారు. హాజరైనవారిలో టోర్నీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీ మాజీ చైర్మన్లు జ్యోతుల నవీన్, నామన రాంబాబు, డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం డైరెక్టర్ కంకటాల రామం, పలువురు కూటమి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. మొదటి మ్యాచ్ ఆంధ్రా, తెలంగాణా మహిళా జట్ల మధ్య జరిగింది. ఆంధ్రా జట్టు విజేతగా నిలిచింది.

వాలీబాల్‌ను ఆదరిస్తున్న తీరు అద్భుతం

తెలంగాణ మహిళా జట్టు కోచ్ రమాదేవి



గొల్లవిల్లిలో వాలీబాల్ క్రీడలను ఆదరిస్తున్న తీరు అద్భుతమని తెలంగాణ మహిళల జట్టు కోచ్, గోల్డ్ మెడలిస్ట్ జి.రమాదేవి వ్యాఖ్యానించారు. మారుమూల పల్లెలో 4 దశాబ్దాలుగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం సాహసోపేతమన్నారు. శనివారం తెలంగాణ క్రీడాకారిణులు స్థానిక అరిగెల వెంకటనరసింహారావు కొబ్బరితోట, వరి పొలాల్లో ఆనందంగా కాలక్షేపం చేశారు. కోచ్ రమాదేవి ఆంధ్రజ్యోతికి గొల్లవిల్లి అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ టోర్నమెంటుపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. వీఎఫ్ఐ నియమనిబంధనలకు అనుగుణంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టోర్నీ కార్యవర్గాన్ని అభినందించారు. జాతీయ పోటీలు నిర్వహిస్తున్న గొల్లవిల్లి వాలీబాల్ కోర్టు అంతర్జాతీయ వేదిక కావాలని ఆకాంక్షించారు. ఆహారం, వసతుల కల్పనలో నిర్వాహకులు చూపిస్తున్న ఆదరణ దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు మరిచిపోలేరన్నారు. గొల్లవిల్లి టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన టోర్నీ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గోల్డ్ హంట్ పేరిట యూట్యూబర్ హంగామా

స్టేడియంలో అనధికారికంగా గుంతలు తవ్విన యువకులు

కేసు నమోదు చేసిన పోలీసులు

అమలాపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో గోల్డ్ హంట్ పేరుతో ఓ యూట్యూబర్ చేసిన హంగామాపై శనివారం అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. బాలయోగి స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం మందపాటి ఆదిత్య అనే వ్యక్తి తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ కోసం గోల్డ్ హంట్ టాస్క్‌తో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలయోగి స్టేడియంలో బంగారం దాచి పెట్టానని, ఆ బంగారాన్ని కనుగొన్నవారికి మొదటి బహుమతిగా బంగారు ఆభరణం, రెండో బహుమతిగా వెండి, మూడో బహుమతిగా ఇయర్ బడ్స్ అందించనున్నట్టు ప్రకటించారు. దాంతో పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు అనధికారికంగా స్టేడియంలోకి ప్రవేశించి గోల్డ్ హంట్‌లో భాగంగా ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వేశారు. ఈ వ్యవహారంపై స్టేడియం అధికారులు ఫిర్యాదు మేరకు మందపాటి ఆదిత్యపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైనట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్ లావణ్యకుమారి తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన 52 ఏళ్ల పురుషుడు జీబీఎస్ లక్షణాలతో చేరినట్టు వెల్లడించారు. శనివారం నమోదైన కేసుతో కలిపి మొత్తం ముగ్గురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు పేర్కొన్నారు. వారిలో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్టు తెలిపారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వైభవంగా రాజశేఖరస్వామి రథోత్సవం

కొత్తపల్లి, మార్చి1(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శ్రీబాలా త్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి కల్యాణమహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారంరాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. విద్యుత్ అలంకరణతో తయారుచేసిన రథంపై రాజశేఖరస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కొత్తపల్లి, వాకతిప్ప గ్రామాలమీదుగా రథోత్సవంసాగింది. కోలాటం గ్రామస్తులను ఆకట్టుకుంది. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అప్పులు చేసి ప్రజలపై భారాలు మోపొద్దు


జీజీహెచ్ ఎదురుగా పూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

● రాష్ట్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం నగర కమిటీ ధర్నా

కాకినాడసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో అప్పులు చేసి ప్రజలపై భారాలు వేయరాదని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం కాకినాడ నగరకమిటీ ఆధ్వర్యంలో శనివారం జీజీహెచ్ ఎదురుగా మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అత్యంత భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఎన్నికల హామీలకు తగిన విధంగా కేటా యింపులు లేవన్నారు. అబివృద్ధి పేరుతో రూ. లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలపై భారాలు వేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఉపాధి కల్పన కు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచాలన్నా రు. తక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేయా లని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ శాఖ ల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కెసత్తిరాజు మాట్లాడు తూ ప్రభుత్వ ఉద్యో గులకు చెల్లించాల్సిన బకాయిలపై బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ హామీలు చిత్తశుద్ధిగా అమలుచేయడానికి తగిన విధంగా నిధుల కేటా యింపులు ఉండాలన్నా రు. కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగరకమిటీ సభ్యుడు వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన ర్యాలీ


పోలీస్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడక్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ వాటిని నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు పోలీస్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాలను మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. శనివారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ జి.బింధు మాధవ్ ఆధ్వర్యంలో మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలతో బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ భానుగుడి జంక్షన్ వరకు సాగిన అనంతరం మహిళలు మానవహారంగా ఏర్పడి మహిళా సంరక్షణ, బాల్య వివాహాల నిషేధంపై నినాదాలు చేసి పలువురికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావ్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ జీవన, ఐసీడీఎస్ పీడీ కె విజయకుమారి, కాకినాడఅర్బన్ సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్యులు పాల్గొన్నారు.

హౌస్ సర్జన్‌లకు శిక్షణ


హౌస్ సర్జన్‌లకు సీపీఆర్‌పై శిక్షణను ఇస్తున్న డాక్టర్ ప్రసన్న

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ నాలుగున్నరేళ్లు పూర్తిచేసుకుని హౌస్ సర్జన్‌లుగా అడుగు పెడుతున్న సుమారు 250 మంది వైద్య విద్యార్థులకు హౌస్ సర్జన్‌లో తీసుకోవాల్సిన పద్ధతులపై శనివారం శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో జరిగింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, పాథాలజీ హెచ్‌వోడి డాక్టర్ కె.రాజేశ్వరీ, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శైలజా ఆధ్వర్యంలో హౌస్ సర్జన్స్‌లో రోగులతో మసులుకోవాల్సిన విధి విధానాలు, పేషెంట్ల నమోదు, ఎలా గౌరవించాలి, పేషెంట్లకు అందించాల్సిన వైద్య చికిత్స, సేవలు, ముఖ్యంగా పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇచ్చారు. అనంతరం జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో అనస్థీషియా ప్రొఫెసర్‌లు డాక్టర్ జి.ప్రసన్న, డాక్టర్ వింధ్య ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.

వేతనాల పెంపుపై ఆశాల చలో విజయవాడ


డీఎంహెచ్‌వో నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశాలు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని లేదంటే ఈనెల 6న చలో విజయవాడ ధర్నాకు సన్నద్ధమవుతున్నట్లు ఆశా వర్కర్‌లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్‌కు శనివారం ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరీ, చంద్రమళ్ళ పద్మ మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్తకు కనీసం వేతనంగా రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒప్పందంలోని ఒకటి, రెండు అంశాలపై అసెంబ్లీలో ప్రకటనలు తప్ప జీవోలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం నిర్వహించడాన్ని తప్పుపట్టారు. యూనియన్ నాయకులు మంగారత్నం, భారతిప్రియ, పద్మావతి, వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


పిఠాపురంలో ఎలక్ట్రికల్ కార్మికులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

పిఠాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శిక్షణ ద్వారా తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని పలువురు వక్తలు సూచించారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ కార్మికులకు పదిరోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. కరెంటుతో నడిచే గృహోపకరణాలు, విద్యుత్ షాక్ తగిలినప్పుడు ప్రథమ చికిత్స, వైరింగ్ చేసేటప్పుడు ఇంటి యజమానితో ఎలా మాట్లాడాలి తదితర అంశాలపై మెప్మా అధికారులు మంగాదేవి, ఇందులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పిఠాపురం ప్రవేటు ఎలక్ట్రికల్ రివైండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వియ్యపు రామన్నరాజు, బండారు నాగశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సూరవరపు గణేష్, సహాయ కార్యదర్శి సత్యశ్రీనివాస్, వినయ్, అనసూరి లక్ష్మణస్వామి, రాయుడు పాపారావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

● డీపీవో రవికుమార్


కొత్తపల్లిలో చెత్తసంపద కేంద్రం వినియోగంపై మాట్లాడుతున్న డీపీవో రవికుమార్

కొత్తపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడ గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నిర్మాణంలో ఉన్న కేంద్రాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే చెత్త నుంచి సంపద తయారు చేస్తున్న కేంద్రాలద్వారా అధికశాతం వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను నాడెప్ తొట్టెలో వేసే విధంగా పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించాలని డీపీవో వివరించారు. స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన అన్నిరకాల ట్రాక్టర్లు, తడి,పొడి చెత్త సేకరించే వాహనాలు, ట్రైసైకిళ్లు ఇన్సిలేర్లు పంచాయతీ కార్యదర్శులు వినియోగించుకోవాలని డీపీవో ఆదేశించారు. ఈవోపీఆర్డీ కె.హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.శ్రీని వాస్, పి.సత్యనారాయణ, ఎస్.ఉమ డీపీవో వెంట ఉన్నారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు ఆనందదాయకం



● ప్రధాని, సీఎంకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కృతజ్ఞతలు

కాకినాడసిటీ, మార్చి1 (ఆంధ్రజ్యోతి): శాసనమండ లి సమావేశాల్లో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ రాష్ట్రంలోని 15మత్స్యకార గ్రామాల అభివృద్ధికి రూ.30కోట్లు మంజూరు చేయడం ఆనంద కరమని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్సీ పద్మశ్రీ మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 22న శాసన మండలిలో రాష్ట్రంలోని 15 మత్స్యకార గ్రామాల అభివృద్ధి కోసం తాను గళం వినిపించానని చెప్పారు. కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం, సీఆర్‌సీఎఫ్‌వీ పథకాల ద్వారా మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని శాసనమండలిలో ప్రతిపాదించామన్నారు. శుక్రవారం జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి నారాయణ ప్రసంగిస్తూ మత్స్యకార గ్రామాలలో వాతావరణ మార్పులను తట్టుకుంటూ సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగేందుకు రూ.30 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మత్స్యకారులకు అండగా నిలిచారని ఎమ్మెల్సీ పద్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

మార్చి ఆరంభంలోనే ఎండ తీవ్రత

కొత్తపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మార్చి నెల ఆరంభంలోనే ఎండ తీవ్రత పెరిగింది. తీరప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్లకు చేరుకున్నారు. సాయంత్రం 4గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది.

మూలపేటలో ప్రైవేటు హాస్టళ్ల తనిఖీ

కొత్తపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు మూలపేటలో ప్రవేటు బాలికల,బాలుర హాస్టళ్ళను కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఇతర మౌళిక సౌకర్యాలపై ఎస్ఐ వివరాలను సేకరించారు. వసతి గృహాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ ఈ సందర్భంగా బాలికలకు, బాలురకు విజ్ఞప్తి చేశారు.

గొల్లప్రోలులో భవన నిర్మాణ కార్మికుల ధర్నా


గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గొల్లప్రోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ రామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. తమను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదుకోవాలని, గతంలో అమలై నిలిచిపోయిన పథకాలు అన్నింటినీ పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు పరిష్కరించాలని డిమా ండ్ చేశారు. అంతకు ముందు పట్టణంలో ప్రదర్శన జరిపారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేశారని, దారి మళ్లించారని ఆరోపించారు. వాటిని తిరిగి బోర్డుకు ఇప్పించాలన్నారు. అనంతరం గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో సంఘం అధ్యక్షుడు అనిశెట్టి నూకరాజు, ఏఐటీయూసీ నాయకుడు కేశవరపు అప్పలరాజు, మొగలి వరప్రసాద్, మోకిరెడ్డి గంగబాబు, కోలా వీరబాబు, పడాల శ్రీను, వీరబాబు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగంచేసుకోవాలి

● వెటర్నరీ జేడీ వెంకటేశ్వరరావు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ జేడీ వెంకటేశ్వరరావు, ఏడీఏ సురేష్‌బాబు

కరప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం ఉచి తంగా పంపిణీ చేస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శనివారం కరపలో ఉచిత వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు ఈ స్పెషల్ క్యాంప్ నిర్వహించి నాలుగు నెలల పైబడిన అన్ని పశువులకు వ్యాధి నివారణ టీకాలను వేస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ డీబీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ కరప, కాకినాడ రూరల్, కాకినాడఅర్బన్ మండలాల పరిధిలో 25,950 గాలికుంటు వ్యాధి టీకాలు, 830 బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలను వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించి పాడిరైతులకు పలు సూచనలు చేశారు. వెటర్నరీ ఏడీ యస్‌జేయస్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సవిత్ర కారక చయన మహాయజ్ఞం ప్రారంభం



పిఠాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో పవిత్రమైన సవిత్ర కారక మహాయజ్ఞం శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహపూజ, యాగశాల ప్రవేశం, రుద్రాభిషేకం, మంగళహారతి నిర్వహించారు. బీజేపీ నేత, మైథిలి చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ మీనాక్షి గిరిధారి, అనంతపూజారి ఆధ్వర్యంలో ఈయాగ క్రతువులు జరిగా యి. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా తెలంగాణా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, అనంత పూజారి, అమేయ, ఆరాధ్య పూజారి, భరత్, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టత కోసం పనిచేయాలి

పిఠాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావులు సూచించారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శనివారం పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పట్టణ కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి రవీంద్రబాబు, బండే శ్రీనివాస్, పెద్దింటి రెడ్డి, రెడ్డిపల్లి కొండలరావు, సోమరౌతు జ్యోతి, గరగ వీరబాబు, ప్రధాన కార్యదర్శులుగా దొడ్డి లక్ష్మీనారాయణ, కంబాల నాగేశ్వరరావు, కార్యదర్శులుగా వానపల్లి రమణ, అల్లుబోయిన నందకిశోర్, కోశాధికారిగా దంగేటి నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వ్యక్తిగత భద్రతపై దృష్టి సారించాలి

సామర్లకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతీ విద్యార్థి వ్యక్తిగత భద్రతపై దృష్టి సారించాలని పారిశ్రా మికవేత్త నామాని రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ఒక పరిశ్రమ యాజమాన్యం భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

దుర్గాడలో వైభవంగా శ్రీపుష్పయాగం


ప్రత్యేక అలంకారంలో పంచాయతన సమేత రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. రామచంద్రపురం వేదపండితుడు గణేష్‌శర్మ బృందం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, గర్భాదానకాండ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దంపత తాంబూలాలు అందజేశారు. స్వామి,అమ్మవార్లకు ఊయలసేవ జరిగింది. ఆల య అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొనగా సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆటోలో బ్యాగు మరిచిపోయిన కోర్టు ఉద్యోగిని

● పోలీసుల ద్వారా అందించిన ఆటో డ్రైవర్


బ్యాగును కోర్టు ఉద్యోగికి అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆటోలో కోర్టు ఉద్యోగి మరిచిపోయిన బ్యాగును పోలీసుల సమక్షంలో డ్రైవర్ అందజేశాడు. పిఠాపురం పట్టణంలోని జిల్లా కోర్టులో స్టెనోగా పనిచేస్తున్న కాద అన్నపూర్ణ కోర్టు డ్యూటీ నిమిత్తం ఉప్పాడ సెంటర్‌లో ఎక్కి కోర్టు దగ్గర దిగిపోయారు. ఆ సమయంలో బ్యాగు మరిచిపోయారు. బ్యాగులో అరకాసు బంగారం, రెండు పెన్‌డ్రైవ్‌లు, సెల్‌ఫోన్, రూ.2,500 నగదు ఉన్నాయి. దీంతో ఆమె పిఠాపురం పోలీసుస్టేషన్‌కు వచ్చి విషయాన్ని తెలిపారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీబాషాలు సెల్‌ఫోన్ లోకేషన్ ట్రాక్ చేశారు. ఈలోగా ఆటో డ్రైవర్ నాగబాబు వచ్చి బ్యాగును పోలీసులకు అందించగా, సీఐ ఈ బ్యాగును అన్నపూర్ణకు అందజేశారు. నిజాయితీగా బ్యాగును అందజేసిన ఆటో డ్రైవర్ నాగబాబును సీఐ అభినందించారు.

ప్రతిష్టాత్మకంగా సామాజిక పింఛన్ల పంపిణీ

సర్పవరంజంక్షన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వింతువులు, వికలాంగులు, కల్లుగీత తదితర లబ్ధిదారులకు ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి నూరుశాతం పింఛన్లు చెల్లించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టిందని డీఆర్‌డీఏ పీడీ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వాకలపూడి, రమణయ్యపేట, వలసపాకల తదితర గ్రామాల్లో సామాజిక పింఛన్ల చెల్లింపు ప్రక్రియను ఎంపీ డీవో పసుపులేటి సతీష్‌తో కలిసి పర్యవేక్షించారు. జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ వలసపాకల, వాకలపూడి, సూర్యారావుపేటల్లో పర్యటించి ఘన వ్యర్థాల ప్రాజెక్టు నిర్వహణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈవోపీఆర్‌డీ ఎంఎస్ శ్రీరామాంజనేయులు, వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేట గ్రామ కార్యదర్శులు పిడుగు పాండు రంగారావు, సత్యనారాయణమూర్తి, రామ్మోహన్‌చౌదరి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వరాలయంలో అన్నసమారాధన

సామర్లకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి):మండలం వేట్లపాలెం శివారున ఉన్న ఉమారామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాలయ చినరాజప్ప ప్రారంభించారు. ముందుగా ఉమారామలింగేశ్వరుడికి ఎమ్మెల్యే చినరాజప్ప, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిలు ప్రత్యేక పూజలు చేశారు. గోలి శ్రీరామ్‌చౌదరి, గుమ్మళ్ళరామకృష్ణ, కొండపల్లి కృష్ణమూర్తి, కెవీవీ. చౌదరి, గుమ్మళ్ళ సత్యనారాయణ, వల్లూరి శ్రీనువాసు, కొండపల్లి చౌదరి, నవీన్ పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే చినరాజప్పకు, రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరికు స్వామి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

పంచలోహాలతో అపర్ణాదేవి ఉత్సవ విగ్రహాలు


పంచలోహాలతో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువెళుతున్న దృశ్యం

గొల్లప్రోలురూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు వెలిసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దాతలు నూతన పంచలోహ ఉత్సవ విగ్రహాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి, సూర్యలక్ష్మి, దంపతులు, కుమార్తె డాక్టర్ నిమిష పూర్ణ, నాగ అపర్ణలు 50కిలోల పంచలోహాలతో అపర్ణాదేవి, నాగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను తయారు చేయించారు. వీటిని శనివారం ప్రదర్శనగా ఆలయానికి తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులకు కంకణధారణ చేసి పుణ్యాహవాచనం, మండపారాధన, పంచగవ్య ప్రాశన చేసి ఆవుపాలతో అభిషేకించారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగగా, కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు చెరుకు శ్రీను, ఆకుల వెంకన్న, అపర్ణా మాలధారణ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మూడు రోజులు పాటు పూజా కార్యక్రమాలు జరుగుతాయి.

విరవాడ నుంచి తొలి తిరుపతికి పాదయాత్ర

పిఠాపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం విరవాడ నుంచి తొలి తిరుపతి వరకూ భక్తులు శనివారం పాదయాత్ర నిర్వహించారు. గోవింద, హరినామ సంకీర్తనలు చేసుకుంటూ విరవ, విరవాడ, దివిలి గ్రామాల మీదుగా శృంగార వల్లభస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించా రు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు అపోలో ఆశీర్వాద్ పథకం మేలు

● కలెక్టర్ షాన్‌మోహన్


పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 1(ఆంధ్రజ్యోతి): అపోలో ఆసుపత్రి ప్రవేశపెట్టిన ఆశీర్వాద్ పథకం పిల్లలు ఎక్కడో దూరంగా ఉండి అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పేర్కొన్నారు. శనివారం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో కాకినాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆశీ ర్వాద్ పథక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఈ పథకంకు సంబంధించి అపోలో రీజనల్ సీఈవో సుబ్రహ్మణ్యం వివరించారు. నడవలేని కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధు లకు టెలి మెడిసిన్, టెలికాలర్ ద్వారా తెలుసుకుని వారికి వైద్య సహాయం అందించవచ్చన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈపథకం విదేశాల్లో దూరంగా ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఎంతో ఉప యోగపడుతుందన్నారు. తాను కాకినాడలో పనిచేస్తున్న కడపలో ఉన్న తన తల్లిదండ్రులు అనారోగ్యంకు గురైతే వెళ్లాల్సిన పరిస్థితి వస్తోందని ఈపథకం అలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటికి వెళ్లి వైద్యం అందించడంద్వారా వారు ఎటు వంటి అనారోగ్యం గురయ్యారో తెలుసుకుని వైద్యంతో నయం చేసేందుకు మేలు కలుగుతుందన్నారు. అనంతరం అపోలో ఆశీర్వాద్ బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపోలో ఏవో ఐవీరమణ, మార్కెటింగ్ హెడ్ అంజిబాబు, సిబ్బంది హాజరయ్యారు.

తల్లి,బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి సీమంతాలు


బాలింతలకు చీరలు, పండ్లు, స్వీట్లు, అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

సర్పవరం జంక్షన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యంతో పాటూ మానసికంగా ఆనందంగా ఉం డేందుకు సామూహిక సీమంతాలు దోహదం చేస్తాయని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు పేర్కొన్నారు. శనివారం రమణయ్యపేట దండు పుంతలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు ఘనంగా సామూహిక సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు చీర, రవికెలు, పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాదరావు, రాయుడు అనిల్, కాలాశ్రీను,మాచరపు సత్యనారాయణ, కాకరపల్లి ప్రతాప్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

కిర్లంపూడి, మార్చి1(ఆంధ్రజ్యోతి): చిల్లంగి గ్రామంలోనున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాధ్‌చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కిర్లంపూడికి చెందిన కొత్త సూర్యప్రకాశరావు, పాపారత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు కొత్త వీరబాబు, గంగాభవానీ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. కార్యక్రమంలో పంతం దొరబాబు, పంతం సురేష్, గొల్లపల్లి కాశీబాబు, చదలవాడ బాబి ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏల పాలన క్రమబద్ధీకరణ !

రంపచోడవరం,మార్చి 1(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో స్తంభించిన రాష్ట్రంలోని ఐటీడీఏల పాలనను క్రమబద్ధీకరించే చర్యలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు సీఎం చంద్రబాబుకు చేసిన ఫిర్యాదు మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నుంచి సంబంధిత శాఖాధిపతులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జగన్ అత్యుత్సాహంతో జిల్లాల విభజన అయితే చేపట్టారు కానీ, తదనంతరం ఆయా శాఖల వ్యవస్థలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా ఆయా ఐటీడీఏలకు పూర్వపు కలెక్టర్లే చైర్మన్‌లుగా ఉండగా, కలెక్టర్ల పరిధిలో ఐటీడీఏలు లేకుండా పోయాయి.దీంతో రెండేళ్లకు పైగా ఐటీడీఏల పాలక వర్గ సమావేశాలూ నడవడం లేదు. ఈ అంశాలన్నిటిపైనా శీతంశెట్టి ముఖ్యమంత్రికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.కొత్త జిల్లాల ఏర్పాటు మేరకు ఆయా ఐటీడీఏలు తమ నియమావళిలో మార్పులు చేసి ప్రస్తుతం ఆయా ఐటీడీఏలు ఉండే జిల్లాల కలెక్టర్లను చైర్మన్లుగా మార్పులు చేసి తీర్మానాలను చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఈ మేరకు మార్పులు జరిగి పాలకవర్గ సమావేశాలు జరుగుతాయని శీతంశెట్టి తెలిపారు.

పింఛన్లను సకాలంలో అందించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం.. పలుచోట్ల పెన్షన్ల పంపిణీ పరిశీలన

రంపచోడవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల 1వ తేదీన లబ్ధిదారులకు అందాల్సిన అన్ని రకాల సామాజిక పింఛన్లు సకాలంలో సక్రమంగా అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని నరసాపురంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని లబ్ధిదారులను ఆరా తీశారు. ఎవరైనా ఎక్కడైనా నిర్లక్ష్యానికి, అలసత్వానికి పాల్పడితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐటీడీఏ పరిధిలోని 7 మండలాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ పరిశీలించారు.

మారేడుమిల్లి ప్రథమం

మారేడుమిల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో మారేడుమిల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ తెలిపారు. మండలంలో1935 మంది లబ్ధిదారులు ఉన్నారని, ప్రభుత్వం మార్చి నెలకు రూ.80,32,500 నగదు జమచేయగా సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 98.5శాతం పింఛన్లు అందజేశారని తెలిపారు.

దేవీపట్నం: మండలంలో 4400 పింఛన్లకు సచివాలయ సిబ్బంది సుమారు 4000 పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మిగతా వారికి సోమవారం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నిర్వాసితులతో ఆటలు ఆడొద్దు: సీపీఎం

కూనవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సర్వం కోల్పోతున్న పోలవరం నిర్వాసితులతో అధికారులు ఆటలు ఆడవద్దని సీపీఎం నాయకులు పాయం సీతారామయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేకసార్లు పోలవరం గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నామన్నారు. దీంతో ఆశతో నిర్వాసితులు ఎదురుచూస్తున్నారని, తీరా సమావేశం నిర్వహించే రోజు రద్దు చేశామని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే కొందరు అర్హులను జాబితా నుంచి తొలగించారని, 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు పరిహారం చెల్లించాలన్నారు.కార్యక్రమంలో సున్నం రాజులు, తాళ్లూరి శ్రీను, ఎం.బాబురావు, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు: ఎమ్మెల్యే

నిర్వాసితుల గురించి ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో స్థానిక టీడీపీ నాయకులు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే తక్షణమే స్పందించి నిర్వాసితులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, తన మాటగా నిర్వాసితులకు హామీ ఇవ్వాలంటూ స్థానిక టీడీపీ నాయకులకు ఆమె తెలిపారు. ప్రతీ నిర్వాసిత కుటుంబానికి ముఖ్యమంత్రి సమక్షంలో పరిహారం అందుతుందన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అడ్డతీగల/దేవీపట్నం/మారేడుమిల్లి/ఎటపాక, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన చట్టం నిబంధనలు కచ్చితంగా పాటించాలని పోలీసులు పేర్కొన్నారు. మార్చి 1నుంచి అమల్లోకి వచ్చిన నూతన వాహన చట్టంపై పలుచోట్ల శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అడ్డతీగలలోని సీతపల్లి సెంటర్‌లో సీఐ నరసింహరావు,దేవీపట్నంలో ఎస్ఐ షరీఫ్, మారేడుమిల్లి ప్రధాన కూడలిలో సీఐ మురళీకృష్ణ, ఎటపాకలో సీఐ కన్నపరాజు వాహనదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాల ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మద్యం తాగి వాహనాలు నడిపినా అపరాధ రుసుం, జైలు శిక్ష ఉంటుందన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1000 జరిమానాతోపాటు 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానాతోపాటు 3నెలల జైలు శిక్ష ఉంటుందని వివరించారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

రాజవొమ్మంగి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి బాలికా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, బాలికల రక్షణ చట్టాలను వివరించారు. విద్యార్థులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడి సంస్మరణ సభ

అడ్డతీగల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల వనంతరం కార్యాలయ ఆవరణలో శనివారం లయ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నఫీసా డామినిక్ సంస్మరణ సభ నిర్వహించారు. లయ డైరెక్టర్ సిద్ధార్థ చేతులమీదుగా స్మారక చిహ్నం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జర్మనీ దేశానికి చెందిన టోబియాస్(ఆశ కిరణ్ సంస్థ ప్రతినిధి), దేశి టెక్నాలజీ అధినేత బెనుధర్ సుదార్-భవనేశ్వర్ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ఆదివాసీల అభివృద్ధికి నఫీషా చేసిన సేవలు మరువలేవన్నారు. అదే స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని సేవలందించాలని సిద్ధార్థకు సూచించారు. 150 మంది ఆదివాసీ నాయకులు విచ్చేసి నివాళులర్పించారు.

మాదిగ అమరవీరుల సేవలు మరువలేనివి

రాజవొమ్మంగి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అశువులు బాసిన మాదిగ అమరవీరుల సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోర్త బుజ్జిబాబు అన్నారు. మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని శనివారం స్థానిక ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనం వద్ద నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు నేతలు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.నూకరాజు, ఎ.అనిల్, కె.దుర్గాప్రసాద్, ఎం.చిన్న, ప్రశాంత్, మధు పాల్గొన్నారు.

గిరిజన యువతకు వస్తువుల తయారీలో శిక్షణ

రంపచోడవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గిరిజన యువతకు వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్నట్టు జరుగుతుందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. శనివారం పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి చిప్పలతో వస్తువుల తయారీ శిక్షణను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి చిప్పలతో 13 రకాల వస్తువుల తయారీపై ఇస్తున్న శిక్షణను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ట్రైనర్ నుకుంజు బిహారిని సత్కరించారు.

ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర బడ్జెట్: శీతంశెట్టి

రంపచోడవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల 22 వేల కోట్లుతో ప్రణాళికాబద్ధంగా కేటాయించారని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ గిరిజన ప్రాంతాలకు ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచారన్నారు. తల్లికి వందనం పథకం అమలుకు బడ్జెట్‌లో రూ.8,157 కోట్లు కేటాయించారని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షకు 18మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షా సూపరింటెంట్ సంతోషకుమారి తెలిపారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 333 మంది హాజరు కావలసి ఉండగా 315మంది హాజరయ్యారన్నారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించామన్నారు. రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వై.రామవరం: వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు వై.రామవరం నుంచి 62మంది, పి.యర్రగొండ నుంచి 97మంది, తోటకూరంపాలెం కేజీబీవీ పాఠశాల నుంచి 32మంది మొత్తం 191మంది హాజరుకావాల్సి ఉండగా 186మంది పరీక్షలు రాసినట్టు చీఫ్ సూపరిండెంట్ ఈశ్వరకృప తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఏలేశ్వరంలో పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఏలేశ్వరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు 740 మంది విద్యార్థులకు 37మంది గైర్హాజరయ్యారు. గురుకుల కళాశాలలో 375మందికి 350, జూనియర్ కళాశాలకు సంబంధించి 365మందికి 353 మంది హాజరయ్యారని డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు ఎ.రామకృష్ణ, కె.శారద, చీఫ్ సూపరింటెండెంట్‌లు కర్రోతు బాబ్జి, సత్యనారాయణ తెలిపారు.

8 మంది గైర్హాజరు

రౌతులపూడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఈసెంటర్‌లో 260మంది విద్యార్థులకు 8మంది పరీక్షలకు హాజరు కాలేదని సిఎస్ జి.విజయ్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

కిర్లంపూడి, మార్చి1(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్ కాంచనమాల, డిపార్టుమెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్‌స్క్వాడ్ పరిశీలించారు.

29 మంది గైర్హాజరు

శంఖవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంఖవరం మోడల్ స్కూల్, కత్తిపూడి సీతారామ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతగా మొదలయ్యాయి. శనివారం శంఖవరం మోడల్ స్కూల్‌లో 303మంది విద్యార్థులు తెలుగు. సంస్కృతం పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 13మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె.కృష్ణవేణి తెలిపారు. కత్తిపూడి సీతారామ కళాశాలలో 290మంది విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 274మంది హాజరయ్యారని, 16మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

తొలిరోజు ప్రశాంతం

తునిరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తొలిరోజు ఇంటర్ పరీక్షలు తునిలో ప్రశాంతంగా ముగిశాయి. తునిలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 2888మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 2768 మంది హాజరయ్యారు. అలాగే 120 మంది విద్యార్థులు గైర్హాజరైనటు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్లు జగ్గంపేట విద్యుత్ ఏఈ వీరభద్రరావు శనివారం తెలిపారు. ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్ మరమ్మతుల్లో ప్రత్తిపాడు, టి.రాయవరం, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఏలూరు, సింహాద్రిపురం, చిల్లంగి, కిర్లంపూడి, పాత యర్రవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

10 నుంచి వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు

గండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్లూరు గ్రామంలో జియ్యన్న మఠంలో వెలసిన వెంకటేశ్వరస్వామి తిరునాళ్లు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్ తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

కోటనందూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైంది. అల్లిపూడి గ్రామానికి చెందిన ఒమ్మల సింహాచలానికి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్టుసర్క్యూట్ వల్ల దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లు బూడిదవగా సుమారు రూ. లక్ష ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రాచపల్లిలో గిరిబాబు పర్యటన



రాచపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో శనివారం వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఈ రెండు గ్రామాల్లో కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరి మాట్లాడారు. అనంతరం రాచపల్లి గ్రామంలో శివరాత్రి ఉత్సవాలకు వెళుతూ ఆటో బోల్తా ప్రమాదంలో గాయపడిన కుటుంబీలను పరామర్శించారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షులు బంకు శ్రీను, వైసీపీ మండల అధ్యక్షులు రామిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాన్ని విస్మరించారు



బుగతా బంగార్రాజు

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాన్ని విస్మరించారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు విమర్శించారు. ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలకు ఎగనామం పెట్టేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మొత్తం మీద రాష్ట్ర బడ్జెట్ ప్రజలకు ఒరిగేదేమీ లేదని తెలిపారు.

వైద్య పరీక్షలు

తుని రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఆదినారాయణ పాల్గొని 70 మందికి ఉచిత వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ డిప్యూటీ గవర్నర్ సీహెచ్ సోమేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు ఎల్.అప్పారావు, ఉపాధ్యక్షుడు ఎం.శివ, కార్యదర్శి ఎంజే రాజు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఓల్వా కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ వివరాల ప్రకారం...సోమవరం గ్రామానికి చెందిన సంకు నూకరాజు(47) ఆటోపై నీళ్ల తెస్తూ యర్రవరం గ్రామం నుంచి సోమవరం వస్తుండగా జాతీయ రహదారికి పైకి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి వైజాగ్ వైపు వెళుతున్న ఓల్వా కారు ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఇతనికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

జె.కొత్తూరులో ఖాళీ బిందెలతో మహిళల నిరసన



జె.కొత్తూరులో నీరు లేక ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

జగ్గంపేట రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో 15 రోజుల నుంచి నీటిఎద్దడి తీవ్రం కావడంతో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి బిందె నీరు కూడా రావడం లేదని మహిళలు వాపోతున్నారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా నీరు కరువైపోయిందని వాపోతున్నారు. ఇన్ని అవస్థలు పడుతున్నా కనీసం అధికార యంత్రాంగం పట్టించుకునే పాపాన పోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నీటి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామని మహిళలు హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

ధర్మవరం హైవేపై సెంట్రల్ లైటింగ్ విస్తరించాలి



రాజమహేంద్రవరంలో హైవే అథారిటీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ప్రత్తిపాడు బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు హైవే అథారిటీ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు, నాయకులు నానిపల్లి శ్రీనివాస్ తదితరులు హైవే అథారిటీ సూపరింటెండెంట్ సురేంద్రసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్మవరం జాతీయ రహదారిపై హైస్కూల్ రోడ్డు కోల్డ్ స్టోరేజ్ సెంటర్, సత్తెమ్మతల్లి గుడి సెంటర్ వద్ద సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హైస్కూల్ రోడ్డు జంక్షన్ వద్ద వందలాది మంది విద్యార్థులు భయాందోళనతో రోడ్డు ఆవలి భాగాన హైస్కూల్‌కు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇక్కడ ఫై ఓవర్ వంతెన లేదా అండర్ పాస్ వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ప్రజల భద్రతకు హైవే అథారిటీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు హైవే సూపరింటెండెంట్ సురేంద్ర సింగ్‌ను కోరారు.

ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నాగేంద్రచౌదరి



నాగేంద్రచౌదరి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షుడిగా పాలచర్ల నాగేంద్ర చౌదరిని భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణ శరణానందభారతి, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొడుగు ప్రసాద్ ఆచార్యులు ఇటీవల నాతవరంలో జరిగిన హైందవ శంఖారావం సభలో భారతీయ ధర్మపరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడిగా ప్రకటించి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేంద్రచౌదరి దంపతులను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి సత్కరించారు. నాగేంద్రచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖనిజ ఇంధన వనరుల వాడకం తగ్గించాలి

జాతీయ లేబొరేటరీ మాజీ ముఖ్య శాస్త్రవేత్త



సదస్సులో మాట్లాడుతున్న భగవన్నారాయణ

తొండంగి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఖనిజ శిలాజాల నుంచి ఉత్పత్తి చేస్తున్న ఇంధన వాడకాన్ని తగ్గించి సంప్రదాయ ఇంధన వనరులను విరివిగా ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని జాతీయ లేబొరేటరీ మాజీ ముఖ్య శాస్త్రవేత్త జి.భగవన్నారాయణ అన్నారు. శనివారం పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత అధిగమించేందుకు హైడ్రోజన్ ప్రత్యామ్నాయ శక్తిగా ఉపయోగపడుతుందన్నారు. విజన్ 2047 ప్రభుత్వ లక్ష్యాలు , ఉద్దేశాలను తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ సదస్సుకు అధ్యక్షత వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ వర్ధన్, టి.రాము, పి.దివాకర్ రావు, చంద్రకళ, పీవీ కృష్ణారావు, చంద్రకళ, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



బాలికలకు కేక్ తినిపిస్తున్న జగ్గంపేట సీఐ వైఆర్‌రూ శ్రీనివాస్

జగ్గంపేట రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడి హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి పూర్ణ, మహిళాశిశు సంక్షేమశాఖ అధికారులు వీటిని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పాల్గొన్నారు. శనివారం పుట్టిన రోజు జరుపుకుంటున్న బాలికలకు సీఐ కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మరాజు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్యం స్పందించే వరకు పోరాటం



ఏలేశ్వరం ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు

ఏలేశ్వరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నేతృత్వంలో శనివారం నిరసన తెలిపారు. డ్రైవర్ ఎస్వీ రమణపై సస్పెన్షన్ పెట్టి విధుల నుంచి తొలగించడం సరికాదని వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎర్ర బ్యాడ్జీలు ధరించి భోజన విరామంలో వారు నిరసన తెలిపారు. ఎన్ఎమ్‌యు కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి యు.బి.ఎమ్ కుమార్, ఎన్‌పి రావు తదితరులు మద్దతు తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో నూతన శానిటేషన్ కాంట్రాక్ట్ అమలు

అన్నవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పలు సత్రం గదులు, మరుగుదొడ్లు, ఆలయ ప్రాంగణం శుభ్రంగా ఉంచేందుకు నిర్వహించే కాంట్రాక్ట్ సంస్థ కాలపరిమితి ముగియడంతో శనివారం నుంచి గుంటూరుకు చెందిన కనకదుర్గ మేన్ పవర్ సర్వీసెస్ సంస్థకు అప్పగించారు. కొంతకాలంగా మ్యాన్‌పవర్, శానిటరీ మెటీరియల్ అంతా కెఎల్‌టీఎస్ సంస్థ సమకూర్చేది. నూతన టెండర్ ద్వారా మేన్ పవర్ మాత్రమే టెండర్ దక్కించుకున్న సంస్థ ఏర్పాటు సి శానిటరీ మెటీరియల్ మాత్రం దేవస్థానం సమకూర్చవలసి ఉంటుందని అన్నవరం దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. త్వరలో ప్రధాన దేవాలయాలన్నింటికీ కలిపి శానిటేషన్ నిర్వహణకు ఒకే సంస్థకు అప్పగించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

మెషిన్ లెర్నింగ్‌పై సమీక్ష

గండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మెషిన్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ డేటా సైన్స్ అప్లికేషన్స్ అంశంపై శనివారం గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. దీనికి వక్తగా డాక్టర్ ఎస్ఎస్ఎస్ ఎన్ ఉషాదేవి హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవీ రాజేష్ పలు అంశాలపై ప్రసంగించారు. డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవీ హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



గండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డి.శ్రీనివాసరావు ఆంధ్రా యూనివర్శిటీ విశాఖ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తదితరులు అభినందించారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అన్నవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న రజకుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషిచేయాలని సత్యదేవ రజక చైతన్య సంఘ అధ్యక్షుడు చోడవరపు సూర్య పేర్కొన్నారు. శనివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పసుపులేటి నాగబాబు, కార్యదర్శి యండమూరి విక్టర్, కోశాధికారి ఏలూరి రాంబాబు, ఓదూరి వీరభద్రరావు, పసుపులేటి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లే మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం



ధర్మవరం పాఠశాలకు వెళ్లే దారిలో గుంత

ప్రత్తిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరం పాఠశాలకు వెళ్లే మార్గంలో రహదారికి పెద్ద గుంతపడి ప్రమాదంగా మారింది. మసీదు సెంటర్‌లోని మండల పరిషత్ పాఠశాలకు వెళ్లే రహదారి మార్గం డ్రైన్‌పై దిమ్మలు కూరుకుపోయి పెద్ద గొయ్యి ఏర్పడి పాఠశాలకు వెళ్లే వారికి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఈ పాఠశాల మార్గాన్ని అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుతున్నారు.